క్లుప్తంగా

హైకోర్టు ఏజీపీ ఫూల్‌సింగ్ నాయక్‌కు సన్మానం



ఫూల్‌సింగ్‌నాయక్‌కు మిఠాయి తినిపిస్తున్న బీజేపీ నాయకులు

అర్వపల్లి : రామన్నగూడెం గ్రామానికి చెందిన న్యాయవాది రమావత్ ఫూల్‌సింగ్‌నాయక్ తెలంగాణ హైకోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులు కావడంతో అతడిని అర్వపల్లిలోని కార్యాలయంలో బీజేపీ జిల్లా నాయకుడు మారపాక రాములు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, వినేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కమిటీ ఎన్నిక



బషీర్, అధ్యక్షుడు

చివ్వెంల : పీఆర్‌టీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూర్యాపేట పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా షేక్ బషీర్, ప్రధాన కార్యదర్శిగా పాదిల రవీందర్ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా గుత్తికొండ మోహన్ రెడ్డి, కార్యదర్శిగా బానోతు సైదా నాయక్, మహిళా ఉపాధ్యక్షురాలుగా టి. మల్లిశ్వరి, మహిళా కార్యదర్శిగా టి.మంజుల ఎన్నికయ్యారు. మర్సు చొక్కా రావు, దండుగుల యల్లయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి రామలింగారెడ్డి, తంగెళ్ల జితేందర్ రెడ్డి, కందుకూరి శివశంకర్, కట్కూరి రవీందర్ రెడ్డి, ఖాజా ఖలీల్ అహ్మద్, గిరి ప్రసాద్, ప్రతాప్, కొల్లు సత్యనారాయణ రెడ్డి, బండారు చంద్రారెడ్డి, దేగల క్రిష్ణ పాల్గొన్నారు.

గీత కార్మికులకు బీమాపై అవగాహన కల్పించాలి

నూతనకల్ : ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అందిస్తున్న బీమాపై అవగాహన కల్పించాలని గౌడజన హక్కుల సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్యగౌడ్ కోరారు. శనివారం ఆయన నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీమా పొందడానికి కావాల్సిన అర్హతలు, బీమా పొందే విధానంపై ఎక్సైజ్ అధికారులు కార్మికులకు వివరించాలని అన్నారు. గౌడ కులస్తులకు అన్ని రిజర్వేషన్లలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సురుగు రామచంద్రు, ఉప్పలయ్య, శేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీ ఎన్నిక

మునగాల : మండలంలోని ఆకుపాములలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గ్రామ కమిటీని శనివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి సమక్షంతో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.రామరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజుల అంజయ్య, సహాయ కార్యదర్శిగా బాలెంల నర్సయ్య, కోశాధికారిగా వల్లపురెడ్డి వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దొంతగాని అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా రాజుల పుల్లయ్య, పోలంపల్లి వెంకయ్యలను ఎన్నుకున్నారు.

దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దోమల మందు పిచికారీ చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, ఏఎన్ఎం సరస్వతి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీఓకు అవార్డు



దారా శ్రీనివాస్‌కు అవార్డు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్, నిర్వాహకులు

మునగాల : మునగాల మండల పంచాయతీ అధికారి డాక్టర్ దారా శ్రీనివాస్‌కు ఎన్‌టీఆర్ లెజెండరీ నంది అవార్డు లభించింది. పలు రంగాల్లో సేవలందించినందుకు గాను అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ప్రముఖ విశిష్ట అతిథులు బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. సాహిత్య రంగంలో కవిగా, రచయితగా తాను చేసిన కృషిని, సామాజిక రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు తెలిపారు.

అనుమతులు లేకుండానే..

- చివ్వెంల మండలంలో జోరుగా ఇటుక బట్టీల వ్యాపారం
- ప్రభుత్వ భూముల నుంచే మట్టి తవ్వకాలు
- విద్యుత్ చౌర్యానికీ పాల్పడుతున్న వ్యాపారులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు



వట్టిఖమ్మంపహాడ్‌లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీ



చెరువుమట్టిని తరలిస్తున్న వ్యాపారులు (ఫైల్)

చివ్వెంల: చివ్వెంల మండలంలో అనుమతులు తీసుకోకుండానే కొందరు వ్యాపారులు ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఈ బట్టీలకు కావాల్సిన మట్టిని ప్రభుత్వ పట్టా భూములు, చెరువుల నుంచే తవ్వి యథేచ్ఛగా తీసుకెళ్తున్నారు. ఈ బట్టీల వద్ద రాత్రి వేళ లైటింగ్ కోసం విద్యుత్‌ను కూడా చౌర్యం చేస్తున్నట్టు సమాచారం. దీనికితోడు బట్టీల నిర్వహణకు విచ్చలవిడిగా చెట్లను నరికి కలపను వాడుతూ వ్యాపారం సాగిస్తున్నారు.

ఈ గ్రామాల్లోనే బట్టీల నిర్వహణ

మండలకేంద్రంతో పాటు ఐలాపురం, గాయంవారిగూడెం, కుడకుడ, దురాజ్‌పల్లి, ఎర్ర సూర్యానాయక్ తండా, లక్ష్మణ్ నాయక్ తండా, గుంజలూరు, వట్టిఖమ్మంపహాడ్, వాల్యతండా గ్రామాల్లో ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇటుకల తయారీకి అనుకూలమైన మట్టిని ప్రభుత్వ భూముల్లో జేసీబీలతో తవ్వి వందలాది ట్రాక్టర్లలో తీసుకువెళ్తున్నా సంబంధిత అధికారుల మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని కొందరు వ్యాపారులను ప్రశ్నించగా తమ పొలాల నుంచే తీసుకెళ్తున్నామని చెబుతుండడం గమనార్హం

ఉచిత విద్యుత్ దుర్వినియోగం

ఇటుకల తయారీకి కావాల్సిన నీటిని రైతుల పొలాల్లోని వ్యవసాయ బోర్ల నుంచి లీజుకు తీసుకొని వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను అక్రమంగా వాడుతూ ఇటుక బట్టీల వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా వ్యవసాయానికి కేటాయించిన ఉచిత విద్యుత్ చౌర్యానికి గురవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటుకల తయారీ అనంతరం వాటిని కాల్చడానికి బొగ్గు, వరిపొట్టు, కట్టెలను ఉపయోగిస్తారు. దీంతో సమీపంలోని అటవీ, గుట్టల ప్రాంతాల నుంచి చెట్లను నరికి కలపను తెచ్చి ఉపయోగిస్తున్నారు. ఈ తతంగమంతా గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే జరిగిపోతోంది. దీంతో అటవీ ప్రాంతంలో చెట్లు కనుమరుగై అక్కడ నివాసముండాల్సిన కోతులు గ్రామాల్లోకి వస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయని జనం వాపోతున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా కొనసాగే ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బట్టీల నిర్వాహకులంతా వివిధ శాఖల నుంచి నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుందని పేర్కొంటున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే..

ఇటుక బట్టీలకు వాడుతున్న మట్టి, కలప, విద్యుత్ చౌర్యం సంబంధిత అధికారులకు తెలిసే జరుగుతోంది. అయినప్పటికీ ఎవరూ తనిఖీలు నిర్వహించడం లేదు. ఇటుక బట్టీల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలి.

– సీహెచ్.కిరణ్, వట్టిఖమ్మంపహాడ్

అనుమతులు తీసుకోవాలి

ఏటా వివిధ గ్రామాల్లో కొందరు వ్యాపారులు ఇటుక బట్టీలు నిర్వహిస్తుంటారు. అందుకు అనుమతుల తీసుకునేలా అధికారులు వ్యాపారులకు ఆదేశాలు ఇవ్వాలి. అనుమతులు తీసుకోకుంటే తగిన జరిమానా విధించాలి. అవసరమైతే కేసులు నమోదు చేయాలి.

– ఎం.డీ.రఫీ, చివ్వెంల

కఠిన చర్యలు తప్పవు

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల నిర్వహణకు సంబంధిత వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.సంతోష్ కుమార్, ఎంపీడీఓ, చివ్వెంల

కోమటిపల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మంచిర్యాల డీసీపీ, తదితరులు

అర్వపల్లి : తన స్వగ్రామమైన జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి గ్రామాన్ని శనివారం మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఎగ్గడి భాస్కర్ సందర్శించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయాన్ని గతంలో తన తల్లిదండ్రులు ఎగ్గడి గురువయ్య–లక్ష్మమ్మల జ్ఞాపకార్థం అభివృద్ధి చేశారు. పూజల అనంతరం 500మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ సతీమణి, ఉపాధ్యాయురాలు మాలిని, ఎగ్గడి యాదయ్య, మాజీ సర్పంచ్ జాల నర్సయ్య, మహ్మద్ అలీ, టి.పరశురాములు, మాండ్ర లింగయ్య, జాల వీరయ్య, జాల మల్లయ్య, నున్న అవిలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు

సూర్యాపేటటౌన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ అవతరణ దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, యాకయ్య, వెంకటయ్య, రమేష్, లాలు, ఆర్.శ్రీను, శ్రీనివాసాచారి, ఆనంద్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పలకల పంపిణీ



పలకలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

తిరుమలగిరి : తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ చెరుకు సుధాకర్, లక్ష్మి పెళ్లి రోజు సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలోని ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేష్ చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆయా రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన జయంతి మహోత్సవం



సుదర్శన జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



సుదర్శన యాగం నిర్వహిస్తున్న అర్చకులు

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన జయంతిని పురస్కరించుకొని సుదర్శన మహాయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు జరిపారు. శ్రీసుదర్శన యాగానికి అంకురార్పణ చేశారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ చేసి, సుదర్శన మహాయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసుదర్శన శతక పారాయణం, మూల మంత్ర హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి వై. శ్రీనివాసరెడ్డి, అర్చకులు సంకర్షణాచార్యులు, శ్రీహరిచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, ఉపేంద్ర ఆచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేక చెరువులు, కుంటలు వెలవెల

- జాజిరెడ్డిగూడెం మండలంలోని నగం చెరువులకు నీటి ఎద్దడి
- ఇప్పటివరకు భారీ వర్షాలు రాక అన్నదాతల ఆందోళన
- సాగు పనులకు ఎస్సారెస్పీ నీటిని వదలాలని వేడుకోలు



కాసర్లపహాడ్‌లో వెలవెలబోతున్న మబ్బోరికుంట



తిమ్మాపురం-అడివెంల మధ్య నీళ్లు లేని కుంట

అర్వపల్లి : వానాకాలం సీజన్ దాటిపోతున్నప్పటికి సరైన వర్షాలు రాకపోవడంతో చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. గతేడాది ఇదే సమయానికి చెరువులు, కుంటలు నిండుగా ఉన్నాయి. దీనికితోడు గోదావరి జలాలు రావడంతో పూర్తిస్థాయిలో పంటల సాగు జరిగింది. కానీ ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా నెలకొంది. జాజిరెడ్డిగూడెం మండలంలో పంటలసాగు పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి ఉంది. మండలవ్యాప్తంగా మొత్తం 85 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో కేవలం సగం వాటిల్లో మాత్రమే కొద్దిపాటి నీళ్లు ఉన్నాయి. మిగిలినవి నీళ్ల లేక వెలవెలబోతున్నాయి. దీనికి తోడు ఈసారి గోదావరి జలాలు రావడం లేదు. నీటి విడుదలపై ఇంతవరకు షెడ్యూలు కూడా ప్రకటించలేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, లోయర్ మానేరు డ్యాం(ఎల్ఎండీ)లలో నీళ్ల లేకపోవడంతో ఎస్సారెస్పీ మొదటి దశకు మాత్రమే నీళ్ల ఇచ్చే అవకాశముందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వర్షాలు వచ్చి ప్రాజెక్టులు నిండితేనే సాగునీటి ఇబ్బందులు తీరుతాయని అధికారులు చెబుతున్నారు.

తగ్గిన వరిసాగు..

జాజిరెడ్డిగూడెం మండలంలో వానాకాలం సీజన్‌లో ప్రతిసారి సుమారు 21వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగవుతుంది. కానీ ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 14వేల ఎకరాల లోపే వరిపంటలను రైతులు సాగు చేశారు. నీటి వసతి లేక చాలామంది రైతులు ఇంతవరకు పంటలసాగు మొదలుపెట్టలేదు. ఎలాగైనా గోదావరి జలాలను విడుదల చేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరి సాగుకు నీళ్లు లేవు



వర్షాలు రాక చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. గోదావరి జలాలను కూడా ఇంతవరకు విడుదల చేయలేదు. దీంతో రైతులు పంటలను సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. గోదావరి జలాలను వదిలితే రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశముంది.

- వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

ఈ నెలాఖరు వరకు అవకాశం



వర్షాలు పడితే ఈనెలాఖరు వరకు రైతులు వరిపంటలను సాగు చేసుకునే అవకాశం ఉంది. ఈసారి ఇప్పటి వరకు పెద్ద వర్షాలు కురవలేదు. దీని మూలంగా చెరువులు, కుంటల్లో నీళ్లు లేవు. సరైన నీటి వసతి లేక ఈసారి కొంత వరకు వరిసాగు తగ్గింది.

- మల్లారెడ్డి, వ్యవసాయ అధికారి

కూరగాయల సాగు.. లాభాలు బాగు



కర్విరాలలో సాగు చేస్తున్న బీర తోట



తుంగతుర్తి సంతలో కూరగాయలు అమ్ముతున్న యువరైతు వెలుగు నవీన్

- ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తున్న కర్విరాల గ్రామ యువరైతు

తుంగతుర్తి : సంప్రదాయ పద్ధతిలో వరి, పత్తి సాగు చేసి ఆశించిన మేర దిగుబడులు రాకపోవటం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటువంటి పరిస్థితిని అధిగమించేందుకు ఆధునిక పద్ధతిలో కూరగాయల సేద్యం వైపు దృష్టి సారించి మంచి లాభాలను ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలోని కర్విరాలకు చెందిన యువ రైతు వెలుగు నవీన్. తనకు ఉన్న భూమిలో గతంలో వరితోపాటు పత్తి సాగు చేశాడు. కానీ వాటితో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో కూరగాయల సాగు వైపు మళ్లాడు. ఉద్యానవన అధికారిణి ప్రవంతి సూచనలతో స్టేకింగ్, మల్చింగ్ పద్ధతిలో రెండేళ్లుగా కూరగాయల సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో బీర సాగు, 10 గుంటలలో కాకరకాయ సాగు, 10 గుంటలలో బెండకాయ సాగు చేస్తున్నాడు. విత్తనాలు పెట్టి 45 రోజులు కాగా అవి కోతకు వచ్చాయి. విత్తనం నాటిన 45 రోజులకు కూరగాయలు కోతకు వస్తాయని, సుమారు 45 రోజులపాటు దిగుబడి వస్తూ ఉంటుందని యువరైతు తెలుపుతున్నాడు.

కూరగాయలకు మంచి ధర..

రైతు తాను పండించిన కూరగాయలను సూర్యాపేట, వరంగల్ మార్కెట్‌లలో విక్రయిస్తున్నాడు. అంతేకాకుండా కొన్ని కూరగాయలను స్వయంగా వారాంతపు సంతల్లో అమ్ముతూ లాభాలు పొందుతున్నాడు. వ్యవసాయ క్షేత్రం జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో ఆ దారి వెంట కూడా కూరగాయలు విక్రయిస్తున్నాడు. ఏటా బీర, టమాట, మిర్చి, కాకర, సొర తదితర కూరగాయలు సాగు చేస్తున్నాడు. రెండున్నర ఎకరాల బీర సాగు నుంచి సుమారు ఎనిమిది టన్నుల దిగుబడి రాగా రూ.3 లక్షల ఆదాయం పొందుతున్నాడు. సాగు, కూలీలు, రవాణా ఖర్చులు పోను సుమారు రూ.2 లక్షల లాభం ఉంటుందని రైతు తెలుపుతున్నాడు.

పాడిపై దృష్టి..

రైతు నవీన్ కూరగాయల సాగుతో పాటు పది గేదెలను పోషిస్తూ పాలను ఉత్పత్తి చేస్తున్నాడు. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి షెడ్డును నిర్మించారు. రోజుకు 50 లీటర్ల పాలను విక్రయిస్తూ రూ.3 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు తెలిపారు. పశువుల ఎరువు ఆధారంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్నానని ఆయన వివరించారు.

రోడ్డు సరిగా లేక విద్యార్థులకు ఇబ్బందులు



బురదమడుగులా మారిన వేల్పుచర్ల రోడ్డుపై బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : వేల్పుచర్ల గ్రామ రోడ్డు వర్షాలకు బురదమడుగులా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు బురదలో అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బురదలో కూరుకపోయి అదుపుతప్పి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ గ్రామం నుంచి ప్రతి రోజు అర్వపల్లికి 50 మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళ్తారు. ఇటీవల చిన్నపాటి చిరుజల్లులకే ఈ రోడ్డు పూర్తిగా బురదమడుగులా మారింది. అర్వపల్లి నుంచి వచ్చే పాఠశాలల బస్సులు బురదలోంచి రాలేక వేల్పుచర్ల ఊరుబయటి నుంచే వెనక్కి పోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పిల్లలు పాఠశాలలకు సమయానికి వెళ్లలేక బడి బంద్ చేసుకుంటున్నారు. తమ గ్రామ రోడ్డును బీటీగా మార్చాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగుపై రైతులకు అవగాహన

చివ్వెంల : రైతులు తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు పొందాలని ధనుక కంపెనీ ఎస్ఎంఈ జె.శంకర్, కేవీకే శాస్త్రవేత్త నరేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జి.తిరుమలగిరి గ్రామంలో ధనుక కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి, వరి సాగులో చీడ, పీడల నివారణకు ధనిక కంపెనీ ఆధ్వర్యంలో అందించే మందుల పనితీరుపై వివరించారు. అనంతరం రైతులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పవన్ కుమార్, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం ఎంపీడీఓగా పవన్‌కుమార్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ఎంపీడీఓగా తుమ్మల పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఇతను చింతలపాలెం ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడ కొంతకాలంగా ఎంపీడీఓ పోస్టు ఖాళీ ఉండగా ఎంపీఓ సందీప్‌కుమార్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు.

నీరు నిలువకుండా డ్రెయినేజీలో పూడికతీత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని 1వ వార్డులో ముత్యాలమ్మ ఆలయం వీధి వెంట మురుగు కాలువ పూడిపోయింది. దీంతో మురుగు నీరు సీసీరోడ్డుపైకి చేరి బురదమడుగులా మారింది. ముత్యాలమ్మ పండుగ సమీపిస్తున్నందున మురుగు కాలువను శుభ్రం చేయించి సీసీ రోడ్డుపై బురద లేకుండా చూడాలని గ్రామస్తులు శనివారం అధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు స్పందించి జేసీబీతో మురుగు కాలువ పూడిక తీయించారు. ఆ తర్వాత గ్రామపంచాయతీ కార్మికులతో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. ముత్యాలమ్మ ఆలయం వద్దకు వెళ్లడానికి ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ తెలిపారు.



మురుగుకాలువ శుభ్రం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

గ్రామాల్లో ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు



మద్దిరాల : చందుపట్లలో ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది



అర్వపల్లి : పడమటితండాలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమి

మద్దిరాల : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి అన్నారు. శనివారం మండల పరిధిలోని చందుపట్లలో బాలింతలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ పేషంట్స్‌కు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది కళావతి, ఎం.ఆనంద్, జి.జయమ్మ, ఎం.మంగ, అనిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల దృష్ట్యా పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని కాసర్లపహాడ్ పల్లె దవాఖానా డాక్టర్ ఎస్.గౌతమి గిరిజనులను కోరారు. కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం పడమటితండాలో శనివారం గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.రమణ, తండా గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నిరూపణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాల వినియోగంపై యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

మద్దిరాల : నేరాల నిరూపణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైందని ఎస్ఐ మధునాయుడు అన్నారు. శనివారం మద్దిరాల మండల కేంద్రంలో సీసీ కెమెరాల వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా కేసులను తొందరగా ఛేదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పొలిశెట్టి శ్రీనివాస్, దేవాలయ అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రావణ శుద్ధ సప్తమి సందర్భంగా ఉదయం శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం, సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షబంధనం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం శ్రావణ శుద్ధ అష్టమి సందర్భంగా సుప్రభాతంతో మొదలై యాగశాల ప్రవేశం, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మంగళవారం శ్రావణ శుద్ధ నవమి, బుధవారం శ్రావణ శుద్ధ దశమి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.